# 7. పెళ్లి చూపులు

నవంబరు ఒకటో తారీకు

ఈశాన్యఋతుపవనాలు ఉధృతంగా ఉన్నాయి.

ఉదయం నుండి చల్లని గాలివీస్తున్నది. జల్లులు జల్లులుగా వానకురుస్తున్నది.

రామారావు పదిగంటల కోచిలో విశాఖపట్నం నుండి పలాసా బయలు దేరాడు.

పెట్టెలో అట్టే మంది ప్రయాణికుల్లేరు. బండి ప్రతి స్టేషనులోను ఆగుతుంది. వానజల్లులు బెంచీలను తడిపేశాయి.

రామారావు కిటికీ దగ్గిర కూర్చున్నాడు. అద్దం వేసుకున్నాడు. బెంచీ తుడుచుకున్నాడు. తెచ్చుకున్న వారపత్రిక చదవడానికి ప్రయత్నించాడు. కాని, సాధ్యపడలేదు. మనసు నిలకడగా లేదు.

కిటికీ అద్దంలోంచి అతను చూస్తున్నాడు. జల్లులు పెద్దవవుతున్నాయి. తెరలు తెరలుగా వస్తున్నాయి. బయట ఏమీ సరిగా కనిపించడం లేదు.

రామారావు ఉద్యోగంలో చేరి ఆరునెలలయింది. ఇంటరు పాసయిన తరువాత పై చదువులు చెప్పించడానికి తల్లిదండ్రులకు స్తోమత లేకపోయింది.

వాళ్లది చాలపెద్ద కుటుంబం. తాతలు, తండ్రులు కలిసే ఉంటున్నారు. లంకంత పురాతనమైన ఇంట్లో అందరూ ఉంటున్నారు.

రామారావు తండ్రిగారు హైస్కూలులో గుమస్తాగా పనిచేస్తున్నారు. తాతగారు మరొక స్కూలులో హెడ్మాస్టరుగా రిటైరయారు.

విజయనగరం మహారాజావారి కళాశాలలో ఇంటరు పాసయిన వెంటనే అతనికి ఉద్యోగం దొరికింది. విశాఖపట్నం మునిసిపాలిటీలో సర్వేయరుగా చేరాడు. ఆరునెలలు ప్రొబేషను ముగిసిన తరువాత పెర్మనెంటు కాళీలో అతనిని వేశారు.

పొద్దున్న టిఫిన్‌తిని అతను బయలుదేరాడు. శ్రీకాకుళంలో వాళ్లమ్మగారు రైలెక్కుతారు. ఆవిడ మినపరొట్టె కాల్చితెస్తారు.

రెండు రోజుల కింద ఒక పెద్ద మనిషి వచ్చి, తన రెండో కూతురుని రామారావు కోసం చూసుకోమని తాతగారితో చెప్పారు. ఆ పని తన పెద్దకోడలికి ఆయన విడిచి పెట్టారు. వెంటనే ఆమె విశాఖపట్నానికి కబురుపెట్టి కొడుకుని కోచిలో బయలుదేరమన్నారు.

జల్లులింకా ముమ్మరమయాయి.

రామారావు తల్లిగారు రైలెక్కేసరికి బాగా తడిసి పోయారు. అతనికి బాగా ఆకలిగా ఉంది. రొట్టె తింటుంటే రైలు ఉర్లాం బ్రిడ్జి దాటుతున్నది.

అప్పుడు సావకాశంగా రామారావు తల్లివేపు తిరిగి అడిగాడు :

"ఇప్పుడు నా పెళ్లికి తొందరేమిటి?"

"నేనూ అలాగే మామగారినడిగాను. పెద్ద మనిషి వచ్చి అడిగితే అతని మాటకు విలువ ఇవ్వాలి. ఇంతకీ పెళ్లి చూపువిని. పెళ్లి చాల దూరంలో ఉంది."

రామారావు మరేమీ మాట్లాడలేదు.

కోచి పలాసా చేరేసరికి మూడు గంటలయింది. వర్షం తగ్గింది. రామారావు బంధువులు స్టేషనుకు దగ్గరలోనే ఉన్నారు. వాళ్ల ఇంటికి వెళ్లి, బట్టలు మార్చుకొని కాఫీలు తాగేసరికి సాయంకాలం అయిదయింది.

పెళ్లి కూతురి తండ్రిపేరు శంకరంగారు. ఆయన రైల్వేలో ఆఫీసరుగా ఉన్నారు. వారి బంగళా చాల పెద్దది. ఇంటినిండా నౌకర్లు, చాకర్లు.

పెళ్లిచూపులు హాలులో ఏర్పాటు చేశారు.

పెళ్లి కూతురి తల్లి ఆప్యాయంగా రామారావు తల్లిని ఆహ్వానించారు. ఆమె పేరు పార్వతి.

శంకరంగారు రామారావు పక్కనే సోఫాలో కూర్చున్నారు. రామారావు ఇంటరు సర్టిఫికెటు చూసి ఆయన అన్నారు.

"నీకు ఫస్టుక్లాసు వచ్చిందే : ఇంజినీరింగులోనో, మెడిసన్‌లోనో చేరలేక పోయావా?"

రామారావు నవ్వి ఊరుకున్నాడు.

అతనికి ఇంజినీరింగులో చేరాలని ఉండేది. కాని, కలిసి రాలేదు. తాతగారి దావా ఓడిపోయింది. ఉండే ఆస్తి అంతా తుడుచుకుపోయింది.

శంకరం గారు కవిత్వం వ్రాస్తారు. తనువ్రాసిన పద్యాలు రామారావుకి వినిపించారు. ధారాశుద్ధిగా వ్రాసిన పద్యాలవి చాల బాగున్నాయి.

మరికొద్ది సేపటిలో పెళ్లి కూతుర్ని తెచ్చి కూర్చోబెట్టారు.

పిల్లపుగా తండ్రిలాగే ఉంది. కొట్టవచ్చిన అందమూలేదు, అలా అని అనాకారికూడ కాదు.

ఆ రోజుల్లో రామారావు గాంధీగారి సాహిత్యం చదివేవాడు. రూపం కన్న శీలం ముఖ్యమని అతను నమ్మేవాడు.

రామారావు తల్లి పెళ్లి కూతురుని అడిగింది :

"నీ పేరేమిటి?"

"జానకి!"

"ఏం చదువుకున్నావు?"

"పదో తరగతి పాసయాను."

"సంగీతం వచ్చా?"

"నేర్చుకుంటున్నాను."

"కుట్లు, అల్లికలు?"

"వచ్చు"

"వంట చెయ్యడం?"

అమ్మాయి నవ్వింది.

"వదినగారూ! అన్ని పనులు వచ్చు. కిందటి సంవత్సరమే మా పెద్ద పిల్లకు పెళ్లి చేశాము. అది అత్తవారింటికి వెళ్లిన తరువాత మా జానకి వెనుకబడింది."

తరువాత శంకరం గారి భార్య కొన్ని నిజాలు వెల్లడి చేశారు.

"వదినగారూ! నాకు పెద్ద సంబంధాలమీద ఆసక్తిలేదు. కుర్రాడు చదువుకొని, భార్యా, భర్తలను పోషించుకునే స్తోమత ఉంటేచాలు. తరువాత తరువాత వాళ్లే పెద్దవాళ్లవుతారు."

రామారావు తల్లి ఏమీ అనలేదు.

తిరిగి పార్వతిగారు అన్నారు.

"పెళ్లి బాగా జరిపిస్తాం. ఏ విధమైనలోటు చేయం."

"ఏ సంగతి మీకు తెలియజేస్తాం" అన్నారు రామారావు తల్లి.

అందరూ లేచి పోతుంటే శంకరంగారు జేబులోంచి ఒక ఉత్తరం తీసి రామారావు చేతికిచ్చారు.

"ఇది మధ్యాహ్నం పోస్టులో వచ్చింది."

రామారావు ఉత్తరం చదివాడు.

"శంకరంగారు?

మీరు చూస్తే రైల్వే ఆఫీసరు - మీరు లాకాయి టాకాయి సంబంధం కోసం ప్రయత్నిస్తున్నారు. మీరెంత, ఈ రామారావుగాడెంత? వాడి ఉద్యోగమెంత? వియ్యం, కయ్యం సమానస్థాయిలో ఉండాలి. ఈ సంబంధం మీకు సరిపడినది కాదు.

ఆశాక రామన్న"

రామరావు ఉత్తరంచదివి నవ్వుతూ, దానిని శంకరంగారికి ఇచ్చి అన్నాడు.

"ఈ ఉత్తరంలో పచ్చి నిజం ఉంది. మా నాన్నగారు గుమస్తా. మా ఆస్తులన్నీ కోర్టు వ్యాపారాలలో పోయాయి. మా పాతిల్లు మా తాతలు కూడా పంచుకోలేదు. యథార్థం చెప్పాలంటే, నేను వేసుకున్న బ్లేజరు కోటు మా స్నేహితుడిది నేను తొడుక్కున్న షరాయి మాసినతండ్రిది. నా ఉద్యోగమా మామూలు అయినది. మా సంబంధం గురించ మరోసారి ఆలోచిస్తే మంచిది!"